క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ లోకి చేరికలు



కారెంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పత్తిపాటి బాలు, ఆయన మద్దతు దారులు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు.వీరికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి కట్టుగా పని చేయాలని కష్టపడి పని చేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. గ్రామ సర్పంచ్ బుర్రి రామగురవయ్య, మాజీ సర్పంచ్ గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, రామ్మడుగు సీతారామయ్య, రామ్మడుగు సైదారావు తదితరులు ఉన్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

విజయపురిసౌత్: నాటుసారా కాచేందుకు అక్రమంగా దాచి ఉంచిన 300 లీటర్ల పులియ బెట్టిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు మాచర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ కే పీ.కిషోర్ శనివారం తెలిపారు. మాచర్ల మండలం చింతల తండా గ్రామ సమీపంలో అక్రమంగా నాటుసారా కాస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడకు చేరుకుని దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.నిందితులు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువతకు చట్టాలపై అవగాహన అవసరం



మాచవరం: యువతకు చట్టాలపై అవగాహన అవసరమని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి మురళీగంగాధర్‌రావు అన్నారు. మండల కేంద్రమైన మాచవరం శ్రీవిజేత జూనియర్ కాలేజీ, స్థానిక ఎస్సీ కాలనీ నందు న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలికల పట్ల లైంగిక దాడులు చేస్తే పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. భౌతిక దాడులు జరిగినప్పుడు ప్రతి దాడి చేయాలని బాలికలకు సూచించారు. పేదలకు ఉచితంగా న్యాయం అందించడం జరుగుతుందని, అందుకు మండల స్థాయిలో న్యాయ సలహా కమిటీని సంప్రదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రథోత్సవం సందర్భంగా పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ఎ. శివనాగిరెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.

మానిటరీ కమిటీ అధ్యక్షుడిగా మరియదాసు

దాచేపల్లి : జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడిగా తక్కెళ్లపాడుకి చెందిన వట్టెపు మరియదాసు ఎన్నికైయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో తనను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని మరియదాసు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మరియదాసుని పలువురు అభినందించారు.

పెదకూరపాడు బీజేపీ అభ్యర్థిగా పోటీ

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని పల్నాడు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు అన్నారు. శనివారం ఆయన తన స్వగ్రామమైన వైకుంఠపురంలో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ తరపున పొత్తులు ఉన్నా లేకున్నా తాను పోటీ చేస్తానన్నారు. అందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు.

నేడు త్యాగరాజ రాధనోత్సవాలు

సత్తెనపల్లి: వాగ్గేయకారులు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్నాయి. సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడామైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి గణతంత్ర పురస్కారాలు



కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పీఆర్ డీఈ శ్రీనివాసరెడ్డి



వీఆర్వో పాశం నాసర్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్



కలెక్టర్ చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రసాదరావు

- గణతంత్రదినోత్సవం నాడు ప్రదానం
- ముగ్గురూ వేర్వేరు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

రెంటచింతల: అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న అధికారులను గుర్తించి వారిని ఉత్తమ అధికారులుగా ఎంపిక చేసి ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని పురస్కారాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయటం విదితమే. అయితే ఈ ఏడాది మండలంలోని పాలువాయి గ్రామంలో ఓ విశేషం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవ పురస్కారాలు దక్కాయి. మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా, ఏపీ ట్రాన్స్‌కో మాచర్ల డీఈ కార్యాలయంలో కమర్షియల్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న కొంతిరెడ్డి హైమావతి ఏపీసీపీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు చేతుల మీదుగా గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఉత్తమ అధికారులుగా అవార్డు పురస్కారాలను పొందారు. మండలంలోని గోలి గ్రామ రెవిన్యూ అధికారిగా పనిచేస్తున్న పాశం నాసర్‌రెడ్డి ఎన్నికల నిబంధనల మేరకు ఓటర్ల జాబితా తయారీలో అంకిత భావాన్ని చూపటంతో ఉత్తమ పోలింగ్ బూత్ అధికారిగా కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వీరు ముగ్గురు ఒకే కుటుంబీకులు కావటం విశేషం. వృత్తి పట్ల వీరికి ఉన్న అంకితభావం వలనే ఉన్నతాధికారుల మన్ననలతో పాటు పురస్కారాలు వరిస్తున్నట్లు మండల ప్రజలు పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలకు ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

మాచవరం పీహెచ్‌సీకి ఉత్తమ సేవా పురస్కారం

మాచవరం: మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లా స్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకుంది. గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ చేతుల మీదగా అవార్డును పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదరావు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో వైద్య సేవలు అందించినందుకు ఉత్తమ పీహెచ్‌సీ, ఉత్తమ డాక్టర్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. వైద్య సేవలు అందించేందుకు సహకరించిన మండల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, పీహెచ్‌సీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.



ఎస్పీ చేతుల మీదగా ప్రశంస పత్రం అందుకుంటున్న ఎస్ఐ సమీర్‌బాషా

ఉత్తమ పోలీసు సేవలకు గుర్తింపు

ఎస్ఐ సమీర్‌బాషాకు ఉత్తమ సేవా అవార్డు

మాచవరం: గురజాల సబ్ డివిజన్ పరిధిలో మాచవరం ఎస్ఐగా పని చేస్తున్న సమీర్‌బాషా ఉత్తమ పోలీస్ సేవా అవార్డుకు ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా కేంద్రం నందు జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డుతో పాటు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఉత్తమ అధికారులకు సన్మానం

మాచర్ల: పట్టణంలోని వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన పలువురికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా సత్కారాలు జరిగాయి. మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, మెప్మా ప్రాజెక్టు మిషన్ మేనేజర్ సుబ్బారావు, ఏఓ కట్టా లక్ష్మారెడ్డి, గైనకాలజిస్టు ఉదయలక్ష్మి, మున్సిపల్ ఆర్ఓ వెంగయ్యలకు అవార్డులందించారు. వీరందరినీ ఆయా శాఖా కార్యాలయాలలో అభినందించి సత్కరించారు.

దాచేపల్లి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు అధికారులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసిన దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ శివనాగరాజులు జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావు ప్రశంసాపత్రం అందుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

విద్యుత్ శాఖ ఏఈగా శివనాగిరెడ్డి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ విద్యుత్ శాఖ ఏఈగా ఎ.శివనాగిరెడ్డి విధుల్లో చేరారు. సాధారణ బదిలీలో భాగంగా గుంటూరు పట్టణం నుంచి పిడుగురాళ్ల పట్టణ ఏఈగా బదిలీపై వచ్చారు. పట్టణంలోని ప్రజలకు విద్యుత్ శాఖ పరంగా సత్వర సేవలు అందిస్తామని చెప్పారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రమణబాబు



అవార్డు అందుకుంటున్న మాచర్ల ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్టు ఉదయలక్ష్మి



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ సురేంద్రబాబు

నేడు ప్రసన్నాంజనేయుని రథం ఊరేగింపు



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు



ఉత్సవానికి సిద్ధమైన రథం

- హాజరు కానున్న శ్రీ త్రిదండి రామానుజ చిన జీయర్‌స్వామి
- పలు ప్రాంతాల నుంచి రానున్న భక్త జనం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో సువర్చలా సమేత శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి తిరునాళ్ల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పండగ మహోత్సవం నేటితో ముగుస్తుంది. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి రోజు దేవాలయంలో యజ్ఞ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గత 17 ఏళ్లుగా పట్టణంలో స్వామివారి రథ మహోత్సవాన్ని దేవాలయ కమిటీవారు నిర్వహిస్తున్నారు. స్వామివారి తిరునాళ్లను వైభవంగా జరుపుకునేందుకు పట్టణంలోని భక్తులంతా ఏర్పాట్లు చేశారు. స్వామివారికి పట్టణంలో రథయాత్ర, బ్రహ్మోత్సవాలు నిర్వహించటం వల్ల భక్తకోటికి ఆయురారోగ్య, భోగభాగ్యాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే కమిటీవారు రథయాత్రను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలుగొందుతున్న ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయ నిర్మాణం 2006లో ప్రారంభమైంది. 2007 జనవరి 28న అత్యంత వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేసుకుంది. అప్పటి నుంచి 17 ఏళ్లుగా ప్రతి ఏటా పూజలు, హోమ యజ్ఞాలు, అభిషేకాలు, దంపతులచే పూజలు చేసి జనవరి 28న కల్యాణ, రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఊరేగింపులో పట్టణ వాసులే కాక దూరప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై రథాన్ని లాగి పునీతుల వుతారు. కల్యాణ మహోత్సాన్ని కన్నుల పండుగగా, ఓ తిరునాళ్లలా నిర్వహిస్తారు. రథోత్సవం రోజు పట్టణంలోని అన్ని దుకాణాలు స్వచ్ఛందంగా మూసి వేసి రథయాత్రలో పాల్గొంటారు. సుమారు 70 వేలమందికి మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. పోలీసులు భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేస్తారు. ఈ రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని ఆలయ కమిటీ అధ్యక్షులు కాకుమాను మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి చిన గంగాధరరావు, కోశాధికారి భవిరిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి కాకుమాను గోపాల నరసింహారావు కోరారు. సమతామూర్తి కేంద్ర ప్రతిష్ఠాపకులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత శ్రీ త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారితో యాత్రను ప్రారంభించనున్నారు.

టౌన్ ఎస్ఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి టౌన్ ఎస్ఐగా ఎం.సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2020 బ్యాచ్‌కి చెందిన సత్యనారాయణ పెదకూరపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, సత్తెనపల్లి టౌన్ సీఐ పి ప్రభాకరరావులను మర్యాద పూర్వకంగా కలిశారు.

నకరికల్లు ఎస్ఐగా రాంబాబు బాధ్యతల స్వీకరణ

నకరికల్లు: నకరికల్లు ఎస్సైగా పైడి రాంబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు చేపడుతున్న ఏ.బాలకృష్ణ బదిలీపై నరసరావుపేట రూరల్ కు వెళ్లారు. దీంతో సత్తెనపల్లి రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న పైడి రాంబాబు నకరికల్లు ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించి శనివారం విధుల్లో చేరారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో గల ఎస్సీ బాలికల వసతి గృహంలో జైభీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 75వ గణతంత్ర దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ ఎస్ఐ కె.స్వర్ణలత మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం, రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ముట్లూరి ఎలీషా బాబు, గంధం హరిప్రసాద్, నేలపట్ల అశోక్ బాబు, నీలం శేఖర్‌బాబు, ఎం.డి.జె.కుమార్, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బూదాల సౌభాగ్యరాజు, వసతి గృహ సంరక్షకురాలు రేణుక, వసతి గృహసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం



సత్తెనపల్లి: విద్యార్థి దశలోనే బాల, బాలికలు ఆరోగ్య వంతులుగా ఉండడానికి క్రీడలు దోహద పడతాయని జిల్లా ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ దాసరి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని భాష్యం పాఠశాలలో ప్రైమరీ ఇంట్రా స్కూల్స్ స్పోర్ట్స్ మీట్ శనివారం నిర్వహించారు.ఈ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకే కాక వారి తల్లిదండ్రులకు కూడా ఆటల పోటీలు నిర్వహించడం విశేషమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సుందర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదుల్లోనే కాకుండా మనో వికాసానికి క్రీడల్లోనూ రాణించాలన్నారు. గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ముందుగా భారీ జాతీయ జెండాను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో చాంప్స్ హెచ్ఎమ్ వి. భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

అచ్చంపేట: సుమారు 30 మంది కూలీలతో వెళుతున్న టాటాఏస్ ఆటో బోల్తాకొట్టడంతో 5గురికి తీవ్ర గాయాలు కాగా, మరో అయిదుగురికి స్వల్పగాయాలైన ఘటన మండలంలోని సంద్రతండా వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన సుమారు 30 మంది కూలీలు మిర్చి కోతలకు తాడువాయి గ్రామ పంచాయతీ పరిధిలోని సంద్రతండాకు వెళ్లి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది.ఈ ప్రమాదంలో అయిదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయాలపాలైన వారిని సత్తెనపల్లిలోని కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల హక్కుల సాధకుడు సీతారామశాస్త్రి

సత్తెనపల్లి: పేద ప్రజల హక్కుల సాధనకు పోరాడిన మహనీయుడు సత్తెనపల్లి మాజీ సర్పంచ్ చతుర్వేదుల సీతారామశాస్త్రి అని సీపీఎం రాష్ట్ర నాయకులు గద్దె చల మయ్య, సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని చతుర్వేదుల సీతారామ శాస్త్రి విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన 54వ వర్ధంతిలో వారు వేర్వేరుగా పాల్గొని మాట్లాడారు. సీతారామ శాస్త్రి పేదలకు ఉచిత వైద్యం అందించారని, జీవితాంతం నమ్మిన సిద్ధాంతాలు, ఆశయాల కోసం పోరాడారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ రాజకీయాలలో పేదలకు అండగా అనేక ప్రజా పోరాటాలు శాస్త్రి నిర్వహించారన్నారు. తొలుత శాస్త్రి విగ్రహానికి శాస్త్రి కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధాశ్రమం, రైల్వే స్టేషన్ వద్ద వృద్ధులకు, పేదలకు అన్న సంతర్పణ, ఆశ్రమ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీతో సాధ్యం

ప్రభుత్వ విప్ పీఆర్కే



పార్టీలోకి చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: వెనుకబడిన వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోలగుట్లకు చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. గత టీడీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను నిర్లక్ష్యం చేసి అణచివేతకు గురిచేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవాన్ని కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో కన్నెబోయిన మల్లయ్య, వెంకటయ్య, గంగాధర్, చందు, నాని, నాగలక్ష్మయ్య, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దికర శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నక్కా ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దికర వెంకటరెడ్డి, నలబోతు మంగారావు తదితరులున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌లను అందజేస్తున్న చౌడేశ్వరి

పాలువాయిగేటు(రెంటచింతల): రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి కుటుంబానికి ఒక వరమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని పాలువాయి గేటు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వారి కుటుంబంలో అనారోగ్యంతో బాధపడేవారు ఉన్నట్లయితే వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆ కుటుంబ ఆరోగ్య విషయాలను ఒక యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. యాప్ ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంట్లో ఎవరికి ఎలాంటి వైద్యసహాయం కావాలో, ఏఏ మందులు అవసరమో తెలుస్తుందని వివరించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌లను మెడికల్ ఆఫీసర్ కె.ప్రదీప్‌రెడ్డి, గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ చంతా సుబ్బారావులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.నారాయణ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి

పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి



కమ్యూనిటీ హాలు పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

రెంటచింతల: గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని పంచాయతీరాజ్ డీఈ పాశం శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రెంటాల గ్రామంలో రూ.45 లక్షల మైనింగ్ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉన్నతాధికారులు ఇచ్చిన నిబంధనల మేరకు ఖచ్చితంగా నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. నాణ్యత లేకుండా పనులు చేసిన బిల్లులను నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాలలో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఇంజినీర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఎన్నికల విధులు చేపట్టే అధికారులు అప్రమత్తంగా ఉండాలని గురజాల ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సెక్టార్ అధికారులకు శనివారం ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ పిడుగురాళ్ల, మాచవరం మండలాలకు చెందిన 21 మంది ఎన్నికల సెక్టారు అధికారులు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటినుంచి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల రూట్ ఆఫీసర్లు, ఎన్నికల ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహించాల్సిన విధి విధానాలపై ఆర్‌డీవో వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు, అక్రమ మద్యం తరలింపు, నగదు తరలింపు వంటి కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, ఎన్నికల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సేవలు చిరస్మరణీయం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పిడుగురాళ్ల: మున్సిపల్ కమిషనర్ సేవలు ఎనలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అందరితో కలివిడిగా ఉంటూ పిడుగురాళ్ల మున్సిపాలిటీ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న వెంకటేశ్వర్లు బదిలీ కావటం బాధాకరమన్నారు. అనంతరం మెమోంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కామెర వెంకటేశ్వర్లు, పట్టణ బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్యలతోపాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లుకు ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా గూడూరు మున్సిపాలిటీకి బదిలీ కావటంతో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డీ.నాగ వెంకట లక్ష్మి శనివారం తెలిపారు. లోక్ అదాలత్‌లో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు, మనోవర్తి కేసులు, సివిల్ తగాదాలు, రెవిన్యూ కేసులు, ప్రీలిటికేషన్ కేసులు పరిష్కరించబడతాయని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.